మహా విషాదం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది దుర్మరణం
- మృత్యుపాశంగా మారిన రథశాల గోడ
- గుడికల్‌లో ముగ్గురి మృతి
- పత్తికొండలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యం..
- ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి మృతి
- నంద్యాలలో ఆటోను ఢీకొన్న మరో లారీ
- ఇద్దరు మృత్యువాత
- చిన్నటేకూరులో అతివేగం
- గొర్రెల కాపరిపై దూసుకెళ్లిన కారు



ఆసుపత్రిలో మృతిచెందిన కూతురును చూసి రోదిస్తున్న సుమన్



తల్లీకూతుళ్లు భూమిక, శ్రీనిత్య (ఫైల్)



శిరీష (ఫైల్) | నాగరాజు (ఫైల్) | లక్ష్మీనరసింహ (ఫైల్) | రాజు (ఫైల్)

మరో రెండు రోజుల్లో దసరా పండుగ.. ఎటుచూసినా సందడి వాతావరణం.. ఇలాంటి తరుణంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.. మహా విషాదాన్ని నింపాయి.. ఓవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు.. జన జీవనాన్ని అతలాకుతలం చేశాయి.. వానలకు తడిసిన ఓ గోడ ఆ కుటుంబం పాలిట మృత్యుపాశంగా మారింది. అందరూ గాఢ నిద్రలో ఉండగా ఒక్కసారిగా గోడ కూలింది.



గుడికల్‌లో కూలిన గోడ

బతుకుదెరువు కోసం వలస వచ్చినవారు మృత్యువాత పడ్డారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రేషన్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బీభత్సాన్ని సృష్టించింది. వెనుక వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి దుర్మరణం చెందారు. పండుగ కోసం కొత్త బట్టలు కొనేందుకు వచ్చి వారు ప్రమాదం బారిన పడ్డారు. ఓ కారు డ్రైవర్ అతివేగం కారణంగా ఓ నిండు ప్రాణం, పలు మూగజీవాలు బలయ్యాయి. గొర్రెలను మేపేందుకు తీసుకురాగా కారు ఆగొర్రెల మందపై దూసుకు వచ్చింది. దీంతో 20 గొర్రెలతో పాటు గొర్రెల కాపరి సైతం మృతిచెందాడు. నంద్యాలలో ఓ లారీ డ్రైవర్ అతి వేగం కారణంగా మరో ఇద్దరు మరణించారు. ఈ వరుస ఘటనలతో ఆయా కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుంది.



నంద్యాల పట్టణంలో ధ్వంసమైన ఆటో



పత్తికొండలో ఘటనా స్థలం వద్ద గుమికూడిన ప్రజలు

వివరాలు 5లో

శ్రీశైలం నుంచి సాగర్‌కు నీరు

- 10 గేట్ల ద్వారా 5,76,940 క్యూసెక్కులు విడుదల



శ్రీశైలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 205 టీఎంసీలుగా ఉంది. డ్యాం నీటిమట్టం మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 883 అడుగులుగా నమోదు అయింది. శ్రీశైలం రిజర్వాయర్ 10 రేడియల్ క్రస్ట్‌గేట్లను ఒక్కొక్కటి 26 అడుగుల ఎత్తుకు తెరిచి స్పిల్ వే గుండా 5,76,940 క్యూసెక్కులు దిగువ సాగర్‌కు విడుదల చేశారు. సోమవారం క్రస్ట్‌గేట్ల ఎత్తు 23 అడుగులుగా ఉండగా వరద ప్రవాహం పెరగడంతో జలశయం ఇంజనీర్లు మరో మూడు అడుగుల ఎత్తును పెంచారు. ఎగువ జూరాల గేట్లు 4,62,448 క్యూసెక్కులు, సుంకేసుల 30,736 క్యూసెక్కులు, హంద్రీ 10,300 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతుండడంతో జలాశయం ఇంజనీర్లు ఎప్పటికప్పుడు వదర ఉధృతిని సాగనంపుతున్నారు. శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలు ఉత్పత్తి అనంతరం 64,211 క్యూసెక్కులు విడుదల చేశారు.

సిద్ధిదాయినిగా భ్రమరాంబికాదేవి



శ్రీశైలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహా క్షేత్రంలో దసరా ఉత్సవాల్లో తొమ్మిదో రోజు అమ్మవారు సిద్ధిదాయినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రాతఃకాల పూజలు, విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు నిర్వహించారు. స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్రపారాయణాలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా కుమారి పూజలు జరిపించారు. వాహనసేవలో భాగంగా స్వామి, అమ్మవారు కైలాస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కళారాధన వేదిక వద్ద మార్కాపురానికి చెందిన శ్వేత నాట్య అకాడమీ కళాకారులు భక్తిరంజని, వనపర్తికి చెందిన సత్యం బృందం ఆలపించిన శైవగీతాలు ఆకట్టుకున్నాయి.

నేడు అశ్వవాహన సేవ: ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు రమావాణీ సేవిత రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిస్తారు. అదేవిధంగా సాయంత్రం ఉత్సవమూర్తులకు అశ్వవాహన సేవ ఉంటుంది.



నృత్యం చేస్తున్న కళాకారులు

విరిగిపడ్డ కొండ చరియలు



ఎగువ అహోబిలంలో విరిగిపడ్డ కొండ చరియలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ అహోబిలంలో భారీ వర్షాల కారణంగా మంగళవారం కొండ చరియలు విరిగి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపోయి స్తంభాలు నేలకూలాయి. ఇటీవల కూడా కొండ చరియలు విరిగిపడి విద్యుత్ స్తంభాలు కూలి విద్యుత్ అంతరాయం కలిగింది. కొండ చరియలు విరిగి పడ్డ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారులు ఎగువ అహోబిలం చేరుకొని విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు.


నందవరంలో దుర్గామాత అలంకారంలో దర్శనమిచ్చిన చౌడేశ్వరీమాత


కె.నాగలాపురంలో దుర్గాదేవి అలంకరణలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు


గీతా మందిరంలో మహాకాళి అలంకరణ


కల్లూరు చిన్న అమ్మవారిశాలలో మహిషాసురమర్దిని అలంకరణ


భద్రావతి భావనారాయణ స్వామి ఆలయంలో దుర్గాదేవి అలంకరణ


మహానందిలో గ్రామోత్సవం

సిద్ధిధాత్రిగా కామేశ్వరీదేవి

మహానంది, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం కామేశ్వరీ దేవి సిద్ధిధాత్రి దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రావణ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. పదో రోజు బుధవారం ప్రత్యేకంగా అలంకరిస్తారు. రాత్రి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

అసురమర్దిని.. అమృత వర్షిణి

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

కర్నూలు కల్చరల్/ బనగానపల్లె/ గూడూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వాసులు దసరా దేవీ శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో పుణ్యక్షేత్రాలు, అమ్మవారి మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. 9వ రోజు మంగళవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. కర్నూలు నగరంలోని మించిన్‌బజార్‌లో పెద్ద అమ్మవారిశాలలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. చిత్తారి వీధిలోని నిమిషాంబ అమ్మవారు సరస్వతీ దేవిగా గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారికి దుర్గాదేవిగా, కల్లూరులో వాసవీ మాత మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. బనగానపల్లె మండలం నందవరం చౌడేశ్వరీమాత మహాదుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. గూడూరు మండలం కె.నాగలాపురంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సమరం కాదు... సంబరం

- సంప్రదాయానికే ప్రాధాన్యం ఇస్తున్న అధికార యంత్రాంగం
- గ్రామాల్లో విస్తృతంగా అవగాహన
- ఉత్సవాల్లో హింసను తగ్గించడానికి ప్రణాళిక
- రేపే దేవరగట్టు బన్నీ ఉత్సవం


బన్నీ ఉత్సవంలో పాల్గొన్న ప్రజలు (ఫైల్)

ఆలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజక వర్గంలోని హొళగుంద మండలంలోని దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయంలో దసరా పండగ రోజు అర్ధరాత్రి రోజు జరిగే బన్నీ ఉత్సవం కలెక్టర్ డాక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సవాలుగా మారింది. ప్రభుత్వ యంత్రాంగం, పోలీసుశాఖ కర్రలు, మద్యం నియంత్రణకు ఎన్ని అవగాహన సదస్సులు, ముందస్తు చర్యలు చేపట్టినా ఉత్సవం రోజున షరా మాములుగానే వేలాది మంది భక్తులు కర్రలతో ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. గతంలో ఉత్సవాల్లో జరిగిన మరణాలు, జరిగిన దాడులు, భక్తులకు గాయాలపై రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఉత్సవాల్లో జరుగుతున్న హింసపై అప్పటి కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు కూడా జారీ చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వం ఈ ఉత్సవాన్ని సీరియస్‌గానే పరిగణించింది. ఏటా ఈ ఉత్సవాలపై పది రోజుల ముందు చర్యలు చేపట్టి అవగాహన సదస్సులు కూడా నిర్వహించారు. ఇప్పటికే కలెక్టర్ సిరి, ఎస్పీ స్వయంగా దేవరగట్టును సందర్శించి బన్నీ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని పరిసర గ్రామాల పెద్దలకు సూచించారు. బన్నీ ఉత్సవం కర్రల సమరం కాదని... సంప్రదాయం అని, మీ ఆచారాలకు, కట్టుబాట్లకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని.. భక్తిమాటున జరిగే వ్యక్తిగత కక్షలకు వేదిక కాకూడదని పోలీసులు చెబుతున్నారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచిస్తున్నారు.

రింగు కర్రలు స్వాధీనం



ఆలూరు సర్కిల్ కార్యాలయంలో పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దేవరగట్టు ఉత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అరికేర గ్రామంలో సోదాలు నిర్వహించగా మారుణాయుధాలు, ఇనుప రింగులు తొడిగిన కర్రలను స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై మారుణాయుధాల చట్టం కింద కేసులు నమోదు చేశామన్నారు. హింసకు తావు లేకుండా ఉండేందుకు 200 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి ఉన్నారు. నాటుసారా నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మద్యం నియంత్రణకు చర్యలు

బన్నీ ఉత్సవంలో ప్రధానంగా మదయం మత్తులో కర్రలు తీసుకుని వెళ్లడం వల్ల అదుపు తప్పి దెబ్బలు తగులుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. దీంతో కర్ణాటక, ఏపీ మద్యంతో పాటు నాటుసారాను నియంత్రించాలని కలెక్టర్, ఎస్పీ పోలీసు ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు.

200 మంది బైండోవర్

దేవరగట్టు ఉత్సవాల సందర్భంగా అరికేర, ఎల్లార్తి, నెరణికి, నెరణికితండా, కొత్తపేట, అరికెర, అరికెరతండా, హెబ్బటం పరిసర గ్రామాల్లో గతంలో ఉత్సవాల్లో అల్లర్లు, ఘర్షణలు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన వారిని గుర్తించి ఇప్పటికే 200 మందిని బైండోవర్ చేశారు. మరికొందరిపై మందిపై కూడా నమోదు చేయనున్నట్లు ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

ప్రత్యేక నిఘా

ఉత్సవాల్లో కొందరు భక్తుల మాటున ఆకతాయిలు భక్తులపై అగ్గి కాగడాలు విసురుతూ భక్తులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. అలాగే ఉత్సవాల్లో కర్రలు పట్టుకుని అత్యుత్సాహం ప్రదర్శించే వారిని గుర్తించేందుకు వీలుగా భారీ లైటింగ్, డ్రోన్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలకు ఇనుప రింగులు తొడిగిన కర్రలు, మారుణాయుధాలు తీసుకురాకుండా గ్రామాల్లో ఇనుప రింగులు తొడిగిన కర్రల కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఇళ్లల్లో సోదాలు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. మారుణాయుధాలు కలిగి ఉన్న వారిపై కేసులు కూడా నమోదు చేశారు. ఉత్సవాల్లో గాయాలైన వారి కోసం వైద్య సిబ్బందిని అంబులెన్స్, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. అగ్నిమాపక వాహనాలను సిద్ధం చేస్తున్నారు.

అశ్వాలపై యాదవరాజులు

- ఒక్కరోజు రాజులుగా వ్యవహరించనున్న మూడు కుటుంబాల సభ్యులు
- విజయదశమిని పురస్కరించుకొని రేపు గుర్రాలపై స్వారీ
- పార్వేటకు సిద్ధమైన రాజవంశీకులు
- మద్దికెరలో నేటికీ కొనసాగుతున్న రాచరిక సంప్రదాయం


అశ్వాలపై సైన్యంతో వెళ్తున్న యాదవరాజులు (ఫైల్)

మద్దికెర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్దికెరలో విజయదశమి రోజున రాజవంశీకులు అశ్వాల పార్వేట నిర్వహిస్తూ వస్తున్నారు. అలాగే ఈ ఏడాది పెద్దనగిరి, చిన్ననగిరి, యామన్ననగిరి అనే మూడు కుటుంబాలకు చెందిన వారు ఒకరోజు రాజులుగా వ్యవహరిస్తూ రాచరికపు సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ మూడు కుటుంబాల పూర్వీకుల ఆచార సంప్రదాయంలో అశ్వాల పార్వేట ఒకటి. యాదవరాజుల వంశీకులు దసరా పండుగ రోజున తలపాగా ధరించి రాచరికపు వస్తువులు, ఖడ్గాలు, మేళతాళాలు, సైనికులతో గుర్రాలపై మద్దికెరకు 3 కిలోమీటర్ల దూరంలోని నాటి యాదవరాజు నిర్మించిన బొజ్జనాయనపేటలోని భోగేశ్వర ఆలయానికి వెళ్తారు. ఇక్కడ పూజలు నిర్వహించి తిరిగి మద్దికెరకు చేరుకుంటారు. యాదవరాజులు గ్రామం నుంచి బయలుదేరేటప్పుడు మద్ది కులస్థులు సైన్యంలా ఆయుధాలు ధరించి అంగరక్షకులుగా గ్రామ శివార్ల వరకు వెళ్తారు. బొజ్జనాయనపేటలోని భోగేశ్వరస్వామి ఆలయంలో ఈ మూడు కుటుంబాల వారు పూజలు నిర్వహించిన అనంతరం మద్దికెరకు గుర్రాలపై స్వారీ చేసుకుంటూ వస్తారు. ఈ పోటీల్లో మొదటిగా వచ్చిన వారు విజయం సాధించినట్లుగా వేడుకలు చేసుకుంటారు. పూర్వం నుంచి యాదవరాజులుగా పిలువబడి పాలేగాళ్లుగా వ్యవహరించిన వాళ్లకు ప్రభుత్వం పింఛన్ ఇవ్వడం చెప్పుకోదగ్గ విషయం. గురువారం విజయదశమి రోజు సాయంత్రం మద్దికెరలో.. దేశంలో ఎక్కడా లేని విధంగా గుర్రాల పార్వేట జరుగుతుంది. సంప్రదాయ ప్రకారం సాయంత్రం గుర్రాల పారువేట ఉంటుందని యాదవరాజులు తెలిపారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వర రావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- బస్సులోని 60 మంది ప్రయాణికులు సురక్షితం

సంజామల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి నుంచి కోవెలకుంట్లకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సంజామల పెండేకటి నగర్ వద్ద అదుపు తప్పింది. సంజామలలో డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ఒక వైపు రోడ్డు క్యూరింగ్ పనులు చేసి బురదను తొలగించారు. ఇదే క్రమంలో మంగళవారం ఉదయం కోవెలకుంట్ల డిపో చెందిన ఆర్టీసీ బస్సు పెండేకంటి నగర్ మలుపు వద్ద అదుపు తప్పింది. 60మంది ప్రయాణికులతో ఫుల్‌గా ఉన్న బస్సు ఒకేసారి అదుపుతప్పి బోల్తాపడే క్రమంలో కొబ్బెరి చెట్టు అడ్డంగా ఉండటంతో బస్సు నిలబడి పోయింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఎస్‌ఐ రమణయ్య ఆధ్వర్యంలో బస్సును రోడ్డుపై చేర్చారు. ప్రయాణికులు సురక్షితంగా వారి గమ్యస్థానాలకు వెళ్లారు.



రోడ్డుపక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

వాగులో పడి యువకుడి మృతి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ వాగులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్నవంచెన వాగు వద్ద మంగళవారం చోటుచేసుకున్నట్లు సీఐ హనుమంతునాయక్, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన జమాల్ బాషా(20) అనే యువకుడు సంజామల మండలం ముదివేడు గ్రామానికి బైక్‌పై వచ్చాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి బిల్లలాపురం గ్రామానికి వల్లంపాడు మీదుగా వెళ్తున్నాడు. లింగాల- వల్లంపాడు గ్రామా ల మధ్య ఉన్న చిన్నవంచన వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. అతడు వాగు దాటుతుండగా బైకు అదుపు తప్పి కిందపడి కొట్టుకుపోయాడు. పక్కనే ఉన్న స్థానికులు గమనించి వల్లంపాడుకి చెందిన తలారికి సమాచారమిచ్చారు. తహసీల్దార్, సీఐ, ఎస్‌ఐలు ఘటనాస్థలికి చేరుకొని గజ ఈతగాళ్లను పిలిపించారు. వారు రెండు గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టగా జమాల్‌బాషా మృతదేహం, బైకు లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మునీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు.

రైలు పట్టాలపై తల పెట్టి ఆత్మహత్య

డోన్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై తలపెట్టి ఓ గుర్తు తెలియని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం డోన్ రైల్వేగేటు సమీపంలో చోటుచేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ బిందు మాధవి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి కర్నూలు నుంచి నంద్యాల వెళ్లే డోన్ రైలు కింద రైలు పట్టాలపై తల పెట్టి ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఈ ఘటనలో అతడి తల, మొండెం వేరైంది. ఈ విషయాన్ని గమనించిన లోకో పైలట్ డోన్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. కుడి చేతి ముంచేతిపై ఆంజనేయస్వామి పచ్చబొట్టు, ఎడమ చేయి భుజంపైన శివమణి పచ్చబొట్టు ఉన్నాయన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు జీఆర్‌పీ ఎస్‌ఐ సెల్ నెంబరు 9030481295ను సంప్రదించాలన్నారు.

ముగ్గురు సీఐల బదిలీ

కర్నూలు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు ఫ్యాక్షన్ జోన్‌లో పనిచేస్తున్న ఎస్. చిరంజీవిని ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్‌కు, కర్నూలు తాలుకా యూపీఎస్‌లో పనిచేస్తున్న ఎం.శ్రీధర్‌ను ఫ్యాక్షన్ జోన్‌కు అలాగే డీఎస్‌బీ-1, కర్నూలులో పనిచేస్తున్న ఎస్.తేజ మూర్తిని కర్నూలు తాలుకా యూపీఎస్‌కు డీఐజీ బదిలీ చేశారు.

ఆదోనిలో 'రామ్‌రాజ్' షోరూం

ఆదోని, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వస్త్ర ప్రపంచంలో గుర్తింపు పొందిన 'రామ్‌రాజ్ కాటన్' సంస్థ కర్నూలు జిల్లా ఆదోనిలో నూతన షోరూం ఏర్పాటు చేసింది. జీహెచ్ రోడ్డులో ఉన్న అరియా హాస్పిటల్ సమీపంలో ఏర్పాటైన ఈ షోరూంను పురవర్గ మాత జంగమర హొసహళ్లి షట్‌స్థల బ్రహ్మ అజత శంబులింగ శివాచార్య స్వామితో కలసి సంస్థ చైర్మన్ కేఆర్ నాగరాజన్ లాంచనంగా ప్రారంభించారు. ఎస్‌బీ దివాకర్‌గౌడ్ దీప ప్రజ్వలనం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రామ్‌రాజ్ కొత్తగా యాంటీ బాక్టీరియల్ ధోతీలను ఆవిష్కరించిందన్నారు. తమ ఉత్పత్తులన్నీ మృదువైన కాటన్ దుస్తులతోనే తయారు చేయబడతాయని, వీటిని వస్త్రరంగంలో నిపుణులు రూపొందించి విక్రయిస్తారని వివరించారు.



షోరూంను ప్రారంభిస్తున్న శివాచార్య స్వామి

ఉత్తరాంధ్రలో 'సామా' ప్రభంజనం

- విజయవాడ ఉత్సవ్, తెనాలి పోటీల్లో ప్రదర్శన



బుర్రా సాయిమాధవ్ నుంచి సత్కారం అందుకుంటున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో పురుడుపోసుకున్న 'జగదేకసుందరి సామా' నాటకం ఉత్తరాంధ్రలో ప్రభంజనం సృష్టించింది. విజయవాడ, తెనాలి పరిషత్ పోటీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'సామా' చారిత్రక పద్య నాటకాని విశేష ఆదరణ లభించింది. సోమవారం రాజధానిలో 'విజయవాడ ఉత్సవ్'లో తొలి ప్రదర్శన ఇచ్చారు. రెండున్నర గంటల పాటూ సాగే ఈ నాటకాన్ని ప్రేక్షకులు ఉత్కంఠభరితంగా తిలకించారు. రాయలసీమ నుంచి ప్రదర్శితమైన ఈ నాటక ప్రదర్శన ప్రజా ప్రతినిధులను, అధికారులను కూడా మెప్పించిందని నాటక దర్శకులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రోత్సాహంతో విజయవాడ ఉత్సవ్‌లో కళారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. అదేవిధంగా తెనాలిలోని కళల కాణాచి నాటక రంగ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో మంగళవారం టీజీవీ కళాక్షేత్రం కళాకరులు సామా నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం ఆసాంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. నిర్వాహక సంస్థ అధ్యక్షుడు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, నటి జయలక్ష్మీ నాటక ప్రదర్శన అనంతరం దర్శకుడు పత్తి ఓబులయ్యతో, కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపిక, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.



సామా నాటకంలోని ఓ సన్నివేశం

మహా విషాదం

- వేర్వేరు ఘటనల్లో ఏడుగురి దుర్మరణం

ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న వరుస ఘటనల్లో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. పొట్ట కూటి కోసం వలస వచ్చిన ఓ కుటుంబంలో ముగ్గురు గోడ కూలి అనంత లోకాలకు చేరారు. ఈఘటన ఎమ్మిగనూరు మండలం గుడికల్‌లో చోటు చేసుకుంది. ఈఘటనను చూసిన ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. అలాగే ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం మూడు ప్రాణాలను బలిగొంది. రేషన్ బియ్యం లారీ అదుపు తప్పి ఆటోపైకి దూసుకు వచ్చింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి అనంత లోకాలకు చేరారు. అలాగే ఓ కారు డ్రైవర్ అతివేగానికి ఓ నిండు ప్రాణం, 20 మూగ జీవాలు బలయ్యాయి. నంద్యాలలో ఓ లారీ ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు.

పొట్ట కూటి కోసం వచ్చి..

- మృతులు నందవరం వాసులు



గుడికల్‌లో కూలిన రథశాల గోడ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పొట్ట కూటి కోసం ఆ కుటుంబం వలస వచ్చింది. ఓ గుడిసెను అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. వారు నివసించే గుడిసె ఓ రథశాల గోడల మధ్య ఏర్పాటుచేశారు. ఆ గోడలే వారి పాలిట మృత్యుపా శాలు మారాయి. నాలుగైదు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలకు తడిసిపోయిన పురా తన రథశాల గోడ కుప్పకూలి ఆగుడిసెపై పడింది. అందులో నిద్రిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. మృతుల్లో అన్నదమ్ములు, కొడుకు ఉన్నారు. ఎమ్మిగనూరు మండలం గుడికల్‌లో సోమవారం అర్ధరాత్రి ఈఘోర దుర్ఘటన చోటుచేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. మం డల కేంద్రమైన నందవరానికి చెందిన బోలదూరు లక్ష్మి, ఆమె తనయులు నాగరాజు (39), రాజు(32) కొన్నేళ్ల క్రితం గుడికల్ వలస వచ్చారు. రామమ్మపేట వీధిలో రథశాలగోడల మధ్యలో ఉన్న ఓగుడిసెను అద్దెకు తీసుకున్నారు. చిన్న చిన్న పనులు చేస్తూత జీవనం సాగించేవారు. నాగరాజు కుమారుడు లక్ష్మీనరసింహ(15) గ్రామంలోని పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం సైతం పనులకు వెళ్లి వచ్చిన వారు భోజనం చేసి గుడిసెలో తల్లి లక్ష్మి, తనయులు నాగరాజు, రాజు, లక్ష్మీనరసింహ నిద్రించారు. అర్ధరాత్రి ఉన్నట్టుండి ఒక్కసారిగా రథశాల తూర్పువైపు ఉన్న గోడ కుప్పకూలి గుడిసెపై పడింది. నిద్రిస్తున్న వారిపై రాళ్లు పడటంతో గాయాలయ్యాయి. నాగరాజు, అతని కొడుకు లక్ష్మీనరసింహకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. రూరల్ పోలీసులకు హుటాహుటిన సమాచారం అందింది. వారు చేరుకొని అంబులెన్స్‌ను రప్పించి రక్తగాయాలతో ఉన్న రాజు, లక్ష్మిని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజు కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. తల్లి లక్ష్మి ఆసుపత్రిలో చిక్సిత పొందుతోంది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుం టుందని భరోసా ఇచ్చారు. గోడ కూలిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు, కొడుకు ముగ్గురు మృతి చెందటంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

గొర్రెల మందపై దూసుకొచ్చిన కారు



సంఘటనా స్థలంలో పోలీసులు, స్థానికులు

కర్నూలు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ కారు డ్రైవర్ అతివేగానికి ఓ నిండు ప్రాణం, 20 మూగజీవాలు బలయ్యాయి. ఈ ఘటన ఉలిందకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు సమీపంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కల్లూరు మండలం బస్తిపాడు గ్రామానికి చెందిన కురువ రాముడు(34) అనే వ్యక్తి తన గొర్రెలను రోడ్డు దాటించేందుకు చిన్నటేకూరు సమీపంలో రోడ్డుకు ఓ పక్కగా నిలబడ్డాడు. హైదరాబాదు వైపు నుంచి బెంగళూరు వెళ్తున్న ఓకారు అతివేగంతో డివైడర్‌ను దాటుకుని ఇవతలివైపు ఉన్న కురువ రాముడు, ఆయన గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 20 గొర్రెలతో పాటు రాముడు మృత్యువాత పడ్డాయి. కారులో ఉన్న వేణుగోపాల్ అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మరో 22 గొర్రెలు గాయపడ్డాయి. మృతుడికి భార్య అనిత, నలుగురు కూతుళ్ల సంతానం ఉన్నారు. ఘటనాస్థలికి హుటాహుటిన రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్‌ఐ ధనుంజయ్ చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి భరత్, ఎంపీ బస్తిపాటి దిగ్భ్రాంతి

కర్నూలు అర్బన్: ఎమ్మిగనూరు, పత్తికొండలో చోటుచేసుకున్న ప్రమాద ఘటనలపై పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మంగళవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెండు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందడం ఎంతో బాధ కలిగించిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కూడా విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

అదుపు తప్పి ఆటోపైకి దూసుకొచ్చిన లారీ

- మృతులు తుగ్గలి మండలం ముక్కెళ్ల వాసులు

పతికొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పింది. వెనుక వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి దుర్మరణం చెందారు. ఈ హృదయ విదారక ఘటన కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణంలోని గుత్తి రోడ్డు మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్నట్లు సీఐ జయన్న తెలిపారు. వివరాలు.. ఆదోని సివిల్‌సప్లై గోడౌన్ నుంచి రేషన్‌బియ్యం లోడ్‌తో లారీ బయలుదేరింది. పత్తికొండకు చేరుకున్న సమయంలో ఇంజన్ ఆగిపోయింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని ముందుకు నడిపాడు. పంచాయతీరాజ్ కార్యాలయం దాటాక ఎత్తు ప్రాంతంలో లారీ ఇంజన్ నిలిచిపోయింది. ఆ ప్రాంతం తగ్గుగా ఉండటంతో లారీ అదుపు తప్పింది. వెనుక వైపునకు దూసుకుపోతూ రోడ్డుపై అడ్డు వచ్చిన తాకుతూ సుమారు 100మీటర్లు వెనక్కి వచ్చింది. సాయిబాబా ఆలయం గేటు వద్ద ప్రయాణికులతో నిలిచి ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఆటో నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు ఎక్స్‌కవేటర్ ద్వారా లారీ తొలగించి ఆటోలో చిక్కుకున్న మృతదేహాలను బయ టకు తీశారు. పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి మృతదేహాలను తరలించారు. మృతులు తుగ్గలిమండలం ముక్కెళ్లకు చెందిన తల్లికూతుళ్లు భూమిక(25) శ్రీనితిక(5) అదే గ్రామానికి చెం దిన శిరీష(25)గా గుర్తించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణం గానే ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. మృతిచెందిన మహిళలకు దసరా పండుగకు పిల్లలకు బట్టలుకొనేం దుకు వచ్చి మృత్యువాత పడినట్టు గ్రామస్థులు తెలిపారు. తల్లి, అక్కతో పాటు ఉన్న భూమిక కుమారుడు రెండేళ్ల తులసిరాం సురక్షితంగా బయటపడ్డాడు. మరో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



తీరని వేదన.. భార్య మృతదేహం వద్ద..



కూతురి మృతదేహంతో తండ్రి



అంబులెన్స్‌లో తరలుతున్న మృతదేహాలు

ఆటోను ఢీకొట్టిన లారీ

- ఇద్దరి మృతి, నలుగురికి తీవ్రగాయాలు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ లారీ అదుపు తప్పి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని రైతునగరం సమీపంలో చోటుచేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వివరాలు.. నూనెపల్లె నుంచి చాకరాజువేములకు వెళ్తుండగా ఆటోలో స్వగ్రామాలకు వెళ్లేందుకు నూనెపల్లె వద్ద ఆటో ఎక్కారు. నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన రాజమ్మ, లక్ష్మిదేవి, ఈశ్వర్, చాకరాజువేములకు చెందిన కరీముల్లా, పసురుపాడుకు చెందిన రమణ ఆటోలో ఉన్నారు. ఈశ్వర్(21), కరీముల్లా(35) నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో మృతిచెందారు. ఈఘటనలో రమణ, రాజమ్మ, లక్ష్మీదేవి ఆటో డ్రైవర్ మాబువుశేన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి, ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లు తెలిసింది.

అందుబాటులో లేని అంబులెన్స్...

రైతునగరం వద్ద రోడ్డు ప్రమాదం జరగగా స్థానికులు అంబులెన్స్‌ల కోసం తీవ్ర ప్రయత్నం చేశారు. కాగా అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడంతో అటు వైపుగా వెళ్తున్న త్రీటౌన్ సీఐ కంబగిరి రాముడు స్థానికుల సహాయంతో స్వయంగా క్షతగాత్రులను ఆటోలో ఎక్కించి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

కర్నూలు మీదుగా బుల్లెట్ ట్రైన్..!

- రైల్వే కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ సర్వే

కర్నూలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మీదుగా బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు హైస్పీడ్ బుల్లెట్ రైలు వాయువేగంతో పరుగులు పెట్టనుంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 626 కిలోమీటర్లు పొడవు హైస్పీడ్ రైల్వే కారిడార్ నిర్మాణం కోసం రైల్వే కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ సర్వే నిర్వహిస్తోంది. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ - చెన్నై, హైదరాబాద్ - బెంగళూరు వయా మహబూబ్‌నగర్, కర్నూలు, డోన్ కారిడార్లు నిర్మాణానికి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆమోదం తెలిపింది. హైస్పీడ్ బుల్లెట్ రైళ్లు దూసుకుపోవడానికి వీలుగా హైస్పీడ్ ఎలివేటెడ్ ట్రైన్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. హైదరాబాద్ - బెంగళూరు కారిడార్ ఎలైన్‌మెంట్‌కు ప్రాథమిక ఆమోదం లభించిందని రైల్వే అధికారులు అంటున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారిలో నిమగ్నమయ్యారు. 621.8 కిలోమీటర్లు, 576.6 కిలో మీటర్లు, 558.2 కిలో మీటర్లు పొడవుతో నిర్మించేలా మూడు ఎలైన్‌మెంట్లు పరిశీలిస్తున్నారు. ఈ కారిడార్‌లో భాగంగా ఏపీలో కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందుపురం రైల్వే స్టేషన్లు నిర్మించేలా ప్రతిపాధించారు. ఏపీలో 263.3 కిలోమీటర్లు, తెలంగాణలో 218.5 కిలో మీటర్లు, కర్ణాటకలో 94.80 కిలోమీటర్లు హైస్పీడ్ రైలు మార్గం నిర్మిస్తారు. డబుల్ లైన్, లూప్‌లైన్స్, సైడింగ్‌లు కలిపి మొత్తం 1,363 కిలోమీటర్లు రైలు మార్గం నిర్మాణానికి సర్వే జరుగుతుంది. ఈ సర్వేను రైల్వే కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ సర్వే నిర్వహిస్తోంది. ఈ మార్గం పూర్తయితే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ట్రైన్ వేగాన్ని బట్టి కేవలం 2 గంటల్లో చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టులో భాగంగా తుంగభద్ర, హంద్రీ నదులపై నూతన రైల్వే వంతెనలు నిర్మించాల్సి ఉంది. తుంగభద్ర నదిలో వంతెనల నిర్మాణం కోసం జియోటెక్నికల్ ఇన్వేస్టిగేషన్ కోసం బోర్ హోల్స్ వేయాల్సి ఉంది. అందుకు అనుమతి కోరుతూ రైట్స్ లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజరు సౌరబ్ మంగళవారం జలవనరుల శాఖ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డికి లేఖ రాశారు.



కర్నూలు సిటీ రైల్వే స్టేషన్

హంద్రీకి కొనసాగుతున్న నీటి విడుదల



గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న నీరు

గోనెగండ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి మంగళవారం మధ్యాహ్నం జీడీపీ ఇరిగేషన్ అధికారులు హంద్రీనదికి జీడీపీ 4వ గేటు ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు 4వ గేటు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని హంద్రీ నదికి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రాజెక్టుకు వరదనీరు చేరడం నిలిచిపోవడంతో ప్రాజెక్టు గేటు మూసివేశారు. అయితే సోమవారం సాయంత్రం నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాంతాలలో ఒక మోస్తరు వర్షం కురియడంతో మంగళవారం మధ్యాహ్నం వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం గాజులదిన్నెప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి నీటి మట్టం(4 టీఎంసీ) 376.70 మీటర్లు ఉంది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.30 మీటర్ల మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో నీరు సామర్థ్యానికి తగ్గట్టుగా పూర్తిగా ఉందని, ఇప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

అహోబిలంలో తమిళనాడు హైకోర్టు జడ్జి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో మంగళవారం తమిళనాడు హైకోర్టు జడ్జి జస్టిస్ ఆశ లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, సీఈవో సౌందర్యరాజన్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద స్వామి వారికి అష్టోత్తర పూజ, అమృత వల్లి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. వేదపండితులు ఆమెకు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ ఆశ

వీడని వాన

- పెద్దకడుబూరులో అత్యధికంగా 53.4 మి.మీ.
- మద్దికెరలో అత్యల్పంగా 1 మి.మీ. వర్షపాతం

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెలతో నైరుతి రుతుపవనాల సీజన్ పూర్తయింది. వాన మాత్రం వీడలేదు. మంగళవారం చివరిరోజు కూడా వరుణుడు తన ప్రతాపాన్ని చూపించాడు. చేతికంది వచ్చిన పంటలు నీటిలో మునిగడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పెద్దకడుబూరులో అత్యధికంగా 53.4మి.మీ నమోదు కాగా, మద్దికెరలో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. 26 మండలాలకు గానూ 24 మండలాల్లో వర్షం కురిసింది. సెప్టెంబరు నెలాఖరు వరకు సాధారణ వర్షం 116.5 మి.మీ కురవాల్సి ఉండగా 225.8 మి.మీ వర్షపాతం నమోదైందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.


దుర్గాదేవిగా అమ్మవారు

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని మంగళశారం 9వ రోజు అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పాణ్యంలో దుర్గాదేవి అవతారంలో అమ్మవారు


బండిఆత్మకూరులో...


జూపాడుబంగ్లాలో..


మిడుతూరులో..


ఆత్మకూరులో దుర్గాదేవిగా వాసవీమాత


నందికొట్కూరులో..


గడివేములలో దుర్గాదేవిగా అమ్మవారు


పాములపాడులో దుర్గాదేవిగా...


వెలుగోడులో దుర్గాదేవిగా...


కొలనుభారతిలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


నంద్యాల పట్టణంలో ప్రత్యేక అలంకారంలో వాసవీమాత

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం


పాములపాడులో దుకాణదారులకు జీఎస్టీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పాములపాడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గింపు పేద, మధ్య తరగతి ప్రజలకు వరమని బీజేపీ మండల అధ్యక్షుడు మురళీ మోహన్ అన్నారు. మంగళవారం ఆయన పార్టీ నాయ కు లతో కలసి తగ్గించిన వస్తువుల జాబితా కరపత్రాలను దుకాణదారులకు పంచిపెట్టారు. జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోపాలక్రిష్ణయ్య, నాగలింగమయ్య, లోకేశ్, వేణు, మల్లికార్జున, మగ్బూల్, హుస్సేన్ పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారమివ్వాలి

పాములపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారమివ్వాలని వైసీపీ మండల కన్వీనర్ నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మం డలంలోని చెలమిళ్ళ, ఇస్కాల, పాములపాడు గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ ముర్తుజావలి, చంద్రారెడ్డి, సురేశ్, బాలునాయక్, రామకోటి, శివలింగం పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన లారీ

● ఇద్దరికి గాయాలు


చెట్టుకు ఢీకొన్న లారీ

మహానంది, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను తప్పించబోయి ఓ లారీ చెట్టును ఢీకొంది. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మహానంది-నంద్యాల రహదారిలోని బొల్లవరం రాళ్ళవాగు వంక వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. బొల్లవరం గ్రామానికి చెం దిన జమాల్ అనే వ్యక్తి మోటర్‌బైక్‌పై నంద్యాలకు వెళ్తున్నాడు. మార్గమధ్యలోని రాళ్లవాగు వంక వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను తప్పించబోయింది. రహదారి ఎక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈఘటనలో లారీ వెనుకభాగం మోటర్‌బైక్‌ను ఢీకొనడంతో జమాల్‌తో పాటు లారీ క్లీనర్ దాదాఖలందర్ గాయపడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

జీవో నెంబర్ 5 రద్దు చేయాలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బలిజలకు వ్యతిరేకంగా జారీచేసిన జీవోనెం 5ను ప్రభు త్వం రద్దు చేయాలని నంద్యాల పట్టణ బలిజ సంఘ నాయకుడు శెట్టి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రథమనందీశ్వర దేవస్థానంలో బుధవారం బలిజ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీవో నెం5కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆత్మీయ సమావేశ అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు మధుసూధన్‌రెడ్డి, సంపత్‌కుమార్, గురుస్వామి మాట్లాడుతూ 15 రోజులుగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నిరసన చేపడుతున్నా ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, ప్రసన్నరెడ్డి, విజయలక్ష్మి, రమణారావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే


తిరుమల తిరుపతి దేవస్థానంలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే

నందికొట్కూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలోని వేంకటేశ్వర స్వామిని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కుటుంబం స్వామివారి దర్శనం కోసం తిరుపతి వెళ్లారు. ఈ విజయదశమి నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు శుభం కలిగేలా ఆశీర్వదించాలని ఆ భగవంతున్ని కోరినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఆత్మకూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని ఆయా రేషన్ దుకాణాల పరిధిలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 57 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 23283 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. కాగా ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను ఆయా గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో రేషన్ డీలర్ సచివాలయ సిబ్బంది లేదా వీఆర్వో లాగిన్ ద్వారా రేషన్ కార్డులను పంపిణీ చేసేలా సివిల్ సప్లై అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి


శంకరయ్య (ఫైల్)

పగిడ్యాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన న్యూస్ పేపర్ ఏజెంట్ శంకరయ్య (67) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. శంకరయ్య గ్రామంలో 15 ఏళ్లకు పైగా పలు పత్రికలకు ఏజెంటుగా పని చేస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవారు. గతంలో ఆర్టీసీ కండక్టరుగా సేవలు అందించారు. గ్రామస్తులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


డ్రోన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పాణ్యం ఎమ్మె ల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో మండలంలోని గని, బిలకలగూడురు గ్రూప్ సభ్యులకు మంగళవారం డ్రోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం లో భాగంగా రైతు గ్రూపులకు ప్రభుత్వం సబ్సిడీతో డ్రోన్‌లను పంపిణీ చేసిందన్నారు. డ్రోన్‌ల సహాయంతో పంటలకు పురుగుమందును సులభంగా పిచికారి చేయించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్, టీడీపీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్, జయప్రకాష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే గౌరుచరిత లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తిరుపాడు గ్రామానికి చెందిన దాసరి నాగలక్ష్మమ్మకు రూ.1.30లక్షలు, బండి హేమలతకు రూ.25,574 చెక్కులను అందజేశారు. ఐటీడీపీ పాణ్యం నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ డీవీఎస్ రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

● సీపీఎం జిల్లా నాయకులు


మొక్కజొన్న కంకులను చూపుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : నాసిరకపు విత్తనాలతో నష్టపోయిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం, వ్యవసాయాధికారులు, దుకాణ దారు లు, కంపెనీ వారు కలిసి ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరావు, గోపాలక్రిష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు మండలంలోని బిజినవేముల గ్రామంలో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రైతులను మోసగిస్తే వారు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నందికొట్కూరు పట్టణంలోని వెంకటేశ్వర ఏజెన్సీ, జయ రాం ఫర్టిలైజర్ షాపులలో 741 అడ్వాంటా, 776 భారతీ కంపెనీకి చెందిన నకిలీ మొక్కజొన్న విత్తనాలను బిజినవేముల రైతులకు అమ్మినట్లుగా సీపీఎం నాయకులు, రైతులు ఆరోపిస్తున్నారు. వీటి ద్వారానే రైతులు పంటల్లో మొక్కజొన్న కంకులకు విత్తనాలు రాకుండా ఒట్టి కంకు లు మాత్రమె వచ్చాయని వారు చూపిస్తున్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లేని ఎడల పెద్దఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. రైతులు వెంకటేశ్వర్లు, శివలింగం, శేఖర్, శ్రీనివాసులు, జయరాం, సుంకన్న, మహబూబ్‌భాష, హుశేన్‌మియ్యా సీపీఎం నాయకులు ఉస్మాన్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

శమీ వృక్షం వద్ద భక్తుల కోసం ఏర్పాట్లు

నందికొట్కూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు రోడ్డులోని జమ్మిచెట్టు దగ్గర శమీ వృక్షదర్శనానికి వచ్చే భక్తుల కోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేసినట్లు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన శమీ వృక్షం వద్ద జరు గుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆ యన పట్టణ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తె లిపారు. అధర్మంపై ధర్మం విజయానికి సూచికగా నిలు స్తుందన్నారు. ప్రతి ఇంటికి ఆనందం ఐశ్వర్యం చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు.

ఘనంగా ఆయుధ పూజ


పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న పురోహితులు

గడివేముల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో దుర్గాష్టమి సందర్భంగా మంగళవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. స్టేషన్‌లోని ఆయుధాలకు, రికార్డులకు ప్రత్యేక పూజలు చేశారు. విధుల్లో విజయాలు చేకూరాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న శేఖర్ మాస్టర్

శ్రీశైలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారిని మంగళవారం రాత్రి డ్యాన్స్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారు ఉభయ దేవాలయాలను సందర్శించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. దసర మహోత్సవాలల్లో స్వామి,అమ్మవార్లను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని శేఖర్ మాస్టర్ తెలిపారు.

శ్రీశైలానికి ధర్మ ప్రచార రథం అందజేత


రథాన్ని విరాళంగా అందజేస్తున్న దాత

శ్రీశైలం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం దేవస్థానానికి హైదరబాద్‌కు చెందిన బాలం సుధీర్ ధర్మప్రచార రథాన్ని విరాళంగా మంగళవారం అందజేశారు. సుమారు రూ.72 లక్షలతో ఈ రథాన్ని తయారు చేసినట్లు దాత తెలిపారు. ఈవో మాట్లాడుతూ వివిధ ప్రాంతాలలో దేవస్థానం తరుపున ధర్మప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు ఈ ధర్మరథం వినియోగిస్తామని తెలిపారు. అనంతరం దాత మాట్లాడుతూ దేవస్థానానికి ధర్మప్రచార రథాన్ని సమర్పించడం తమ పూర్వజన్మసుకృతంగా బావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పి.రమేష్‌నాయుడు, అర్చకస్వాములు, వేద పండింతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ రామాలయంలో మంగళవారం ఉదయం భక్తిశ్రద్ధలతో చండీ హోమం చేశారు. యడవల్లికార్తికేయశర్మ ఆచారత్వమున చండీ హోమాన్ని భగవత్‌సేవా సమాజ్‌కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమంలో 55 జంటలు పాల్గొన్నారు.

భారీ వర్షం


నీట మునిగిన వరి పంట


రామాపురంలో నీటి మునకలో వరి పొలాలు, నీట మునిగిన పంటను చూపిస్తున్న రైతులు

బండిఆత్మకూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. సుమారు 8సెం.మీ వర్షం కురిసింది. దీంతో పలుగ్రామాల మధ్య మద్దిలేరువాగు, ఉప్పాగులు ఉధృతంగా ప్రవహించటంతో రాకపోకలు నిలచిపోయాయి. అలాగే శింగవరానికి చెందిన ఈశ్వర్ అనే వ్యక్తి మోటార్ బైక్ వరద ఉధృతిలో కొట్టుకుపోగా అతను ప్రాణాపాయం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. రామాపురం, లింగాపురం, బండిఆత్మకూరు గ్రామాల్లో మద్దిలేరు వాగు ప్రవాహం, కేసీలోకి వెళ్లాల్సిన వంకల నీరు అందులోకి వెళ్లలేక పోవటంతో వందల ఎకరాల్లో వరిపంట నీటమునిగింది.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశం లో ఆర్‌ఎస్ఎస్ మనవాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.నరసింహులు పిలుపునిచ్చారు. మహాత్మాజ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 153వ ఆవిర్భావ దినోత్సవం, షాహిద్ భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వై.నరసింహులు మాట్లాడారు. 153 సంవత్సరాల క్రితం కుల వివక్షతకు వ్యతిరేకంగా సాంఘిక సమానత్వం కోసం జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజ్ స్థాపించా రు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి గోపాల్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియా, ఫ్రూట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిక్కయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు శివ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు


న్యాయాధికారిని సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కర్నూలు ఫస్ట్‌క్లాస్ అడిషనల్ సెషన్స్ న్యాయా ధికారి కమలాదేవి, కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి ఘన స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఆశీర్వాద మంటపంలో న్యాయాధికారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. డోన్ డివిజన్ ఎలక్ట్రికల్ డీఈఈ కమలాకర్‌రావు, బేతంచెర్ల ఏడీఈ మధుసూధన్‌రెడ్డి, అనంతపురం పంచాయతీరాజ్ రీజియనల్ డైరెక్టర్ నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, ఏఎస్‌ఐ రఫీక్, అర్చకులు నారాయణస్వామి పాల్గొన్నారు.

ఆలయ సిబ్బందికి దుస్తుల పంపిణీ

కొత్తపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించకకుని కొలనుభారతి క్షేత్రంలో వివిద విభాగాల్లో పనిచేస్తున్న ఆలయ సిబ్బందికి నంద్యాల జిల్లా బీజేపీ కార్యదర్శి అగస్త్యన్ శంకర్‌గౌడు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. శంకర్‌గౌడు మాట్లాడుతూ ఎంతో కాలంగా కొలనుభారతి అమ్మవారి సన్నిధిలో సేవలందిస్తున్న సిబ్బందికి సుమారు రూ.8వేలు విలువగల దుస్తులు పాయింట్లు, షర్టులు, పంచలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణుడు, లింగస్వామి, శివ, శంకర్, తిరుపాలు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా వైసీపీ


కొత్తపల్లిలో డిజిటల్ బుక్ యాప్‌ను ప్రారంభిస్తున్న వైసీపీ నాయకులు

కొత్తపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా వైసీపీ ఉంటుందని జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కే.సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం వైసీపీ డిజిటల్ బుక్ యాప్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కూటమి నాయకులు వైసీపీ నాయకులపై దాడులు ఎక్కువయ్యాయని, వారి నుంచి తమ పార్టీ కార్యకర్తలను కాపాడుకునేందుకు డిజిటల్ బుక్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. వైసీపీ కార్యకర్తలు ఈ డిజిటల్ బుక్‌యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు బాల ఎల్లయ్య, దూదెప్ప, నాయకులు నాగలక్ష్మిరెడ్డి, రహంతుల్లా, మునిరంగ, పరుశురాముడు, లింగారెడ్డి, వెంకటేశ్, మహబూబ్ బాషా, శ్రీనివాసరెడ్డి, బాబురెడ్డి, అచ్చిరెడ్డి, శ్రీనివాసులు యాదవ్, కొక్కెరంచ రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

బోర్డులను ఏర్పాటు చేయాలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి దుకాణంలో జీఎస్టీ తగ్గింపు వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వివరాలను యాజమాన్యాలు ఏర్పాటు చేయలేదన్నారు. నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా దుర్గాష్టమి వేడుకలు



చౌడేశ్వరీమాతను దర్శించుకుంటున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీమాత దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి హాజరయ్యారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ఆహ్వానం మేరకు బీసీ రాజారెడ్డి చౌడేశ్వరీమాతను దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ మండపంలో మహాదుర్గా అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. బీసీ రాజారెడ్డి, సీఐ మంజునాథరెడ్డిలకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు.

బెస్త కార్పొరేషన్ డైరెక్టర్‌గా మల్లికార్జున



డోన్ టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి, బెస్త సంక్షేమం, అభివృద్ధి డైరెక్టర్‌గా డోన్‌కు చెందిన ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జునను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకం ఉంచి రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా శ్రీకాంత్‌రెడ్డి



శిరివెళ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండల టీడీపీ కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బోయలకుంట్ల గ్రామానికి చెందిన కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి కర్నూలు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా, బోయలకుంట్ల సహకార సంఘానికి పలుమార్లు చైర్మన్‌గా, శిరివెళ్ల మండల ఎంపీపీగా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. మండలంలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన శ్రమను గుర్తించడంతో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో సీఎం చంద్రబాబు కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా స్థానం కల్పించారు. సీఎం చంద్రబాబు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియలకు శ్రీకాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారి ప్రత్యేక పూజల్లో బుగ్గన అర్జున్ రెడ్డి



నృత్య కళాకారులతో బుగ్గన అర్జున్ రెడ్డి

డోన్ రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేట అమ్మవారిశాలలో మంగళవారం రాత్రి జరిగిన అమ్మవారికి ప్రత్యేక పూజల్లో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలనంతరం అమ్మవారిశాలలో జరిగిన చిన్నారుల నృత్య ప్రదర్శనను అర్జున్ అమర్నాథ్ రెడ్డి తిలకించారు. కార్యక్రమంలో డోన్ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దుర్గామాతకు పట్టు వస్త్రాలు సమర్పణ

బేతంచెర్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే కోట్ల మేళ తాళాల మధ్య ఊరేగింపుతో వెళ్లి పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. అలాగే పట్టణంలోని గౌరిపేటలో ఉన్న ఆంజనేయ స్వామికి, వేంకటేశ్వరస్వామికి, వాసవి కన్యకా పరమేశ్వరీదేవికి ఎమ్మెల్యే కోట్ల దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండా గోపాల్, బచ్చు సుబ్రహ్మణ్యం, అశ్వర్థ నారాయణ, ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం మండ లంలోని హుశేనాపురం గ్రామంలో గ్రామ పెద్దల సహకారంతో జమ్ములమ్మ, గంగమ్మ దేవతలను 40 రోజుల చల్లదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూడా ఎమ్మెల్యే కోట్ల పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగ య్య, నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మండల సహకార సంఘం సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాసులు, బుగ్గన బ్రహ్మానందరెడ్డి, భీమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



దుర్గాదేవికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి



దుర్గామాత సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

దుర్గామాతకు కోట్ల సుజాతమ్మ పూజలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి కుమార్తె బుగ్గన మాధవిరెడ్డి ఇంటి వద్ద ప్రతిష్ఠించిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర దుర్గాదేవిని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సందర్శించి పూజలు చేశారు. కోట్ల సుజాతమ్మను బుగ్గన మాధవిరెడ్డి, పలువురు మహిళలు పూలమాలలు, శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు.

అహోబిలంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు



కలెక్టర్ రాజకుమారికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అహోబిలం క్షేత్రాన్ని మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి దర్శించుకొని లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను గురించి ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ స్వామి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ తమిళనాడు హైకోర్టు జడ్జి జస్టిస్ ఆశను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు బస్సు సర్వీసు

బేతంచెర్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు బస్సు సర్వీసును డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మంగళవారం ప్రారం భించారు. మండలంలోని మారుమూల గ్రామాలైన హుశేనాపురం తవిసి కొండ గ్రామాలకు గత 20 ఏళ్లుగా బస్సు సౌకర్యం లేదు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఎమ్మెల్యే కోట్ల తవిసికొండ, హుశేనాపురం గ్రామా లను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ ఊర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారు లతో మాట్లాడి బనగానపల్లె నుంచి బేతంచెర్ల, రంగాపురం, గుటుపల్లె మీదుగా హుశేనాపురం, తవిసికొండ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించారు. దీంతో ఆయా గ్రామాల గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మండల సహకార సొసైటీ సంఘం చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు పోలూరు రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకవచ్చిందని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ కో-కన్వీనర్ వీఆర్ లక్ష్మిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో నూతన స్మార్ట్ కార్డులను వీఆర్ లక్ష్మిరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, వెంకట మల్లారెడ్డి, పెద్దిరెడ్డి, రామలక్ష్మణ్ణ, పెద్దన్న పాల్గొన్నారు.

- మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో డీలర్ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు తెలికి నాగేశ్వరరెడ్డి, గూడూరు నాగేశ్వరరెడ్డి, ఉలువల నరసింహుడు, ఉలువల ప్రసాద్, అందె రాము స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.



స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న వీఆర్ లక్ష్మిరెడ్డి

బాధితులకు చెక్కుల అందజేత

బనగానపల్లె, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురి బాధితులకు వసుధాఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం టంగుటూరు శ్రీనయ్య కార్యాలయంలో రూ.14వేలు విలువగల చెక్కులను ఫౌండేషన్ కోర్డినేటర్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కోవెలకుంట్ల మండలం కలుగొట్లకు చెం దిన బాలయ్యకు, బనగానపల్లెకు చెందిన శివమ్మకు చెక్కులు పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కుక్క కాటుకు గురైన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కోవెలకుంట్ల పట్టణం స్వామినగర్ వాసి మెట్ల నాగరాజు (40) రెండు నెలల కింద కుక్క కాటుకు గురయ్యాడు. అప్పటి నుంచి కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనం తరం అతన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుంచి కర్నూలు ప్రభు త్వ ఆసుపత్రికి రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ ఉండేవాడు. వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో మంగళవారం కోవెలకుంట్లలోని స్వామినగర్‌లోని తన స్వగృహంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

మదనంతపురంలో చోరీ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనం తపురం గ్రామంలో సుద్దల గంగన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. గంగన్న ఎర్రగుడిలో పొలం పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. అయితే మంగళవారం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం తొలగించి ఉందని బాధితుడు గంగన్న తెలిపారు. ఇంట్లోని ఒక జత బంగారు కమ్మలు, ముక్కురాయి, దేవుడి వద్ద తీర్థ యాత్రల కోసం ఉంచిన నగదు హుండీ ఎత్తుకెళ్లినట్లు వాపోయాడు. వీటి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): డోన్ సబ్ డివిజన్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా పాత ఇళ్ల బలహీనమైన గోడలు కూలిపోయే ప్రమాదం ఉందని, ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు జాగ్రత్తలు తీసుకుని తాత్కాలికంగా సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలన్నారు. గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని, ఆ వాగులును దాటే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. ఎక్కడైనా నీరు ముంచెత్తే పరిస్థితులు, ప్రమాద సూచికలు కనబడితే పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బీపీహెచ్ యూనిట్ పనులు ప్రారంభం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం తలపెట్టిన బీపీహెచ్ యూనిట్ భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈనెల 22న 'ఆగిన పనులు .. బీపీహెచ్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యేదెన్నడో ..' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందించారు. బీపీహెచ్ యూనిట్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో గత మూడు రోజులుగా బీపీహెచ్ యూనిట్ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

చాగలమర్రి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పాడి రైతులు పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పశువుల్లో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంప్ హౌస్‌లో ఆయుధ పూజ



డోన్: ఆయుధ పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ తదితరులు

డోన్ టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పేరంటాలమ్మ గుడి దగ్గర ఉన్న పంప్ హౌస్‌లో మంగళవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, డీఈ రఘు, ఏఈ సురేష్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సంజామల: మండల కేంద్రమైన సంజామల పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. మంగళవారం దుర్గాష్టమిని పురస్కరించుకొని వేద పండితులు సుధా చక్రవర్తి సమక్షంలో ఆయుధాలకు పూజలు నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా కూష్మాండ బలి వేడుకలు



వివిధ వేషధారణలో కళాకారులు

బనగానపల్లె, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో దుర్గాష్టమిని పురస్కరించుకొని కూష్మాండ బలి వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య శాశ్వత అధ్యక్షుడు పీఎస్ఎస్ నారాయణ, పట్టణ అధ్యక్షుడు గాథం శెట్టి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కూష్మాండ బలి వేడుకలు నిర్వహించారు. పట్టణం లోని వాసవీభవన్ నుంచి కూష్మాండ బలి విగ్రహాన్ని వివిధ రకాల వేషధారణ కళాకారులతో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ఘనంగా చండీహోమం: బనగానపల్లె కొండ పేటలో వాసవీమాత అమ్మవారిశాలలో చండీహోమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు హోమంలో కూర్చున్నారు.

రేణుకా ఎల్లమాంబేశ్వరికి పూజలు

డోన్ టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా దేవీ శరన్నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా కొండపేటలో వెలసిన రేణుకా ఎల్లమాం బేశ్వరి ఆలయంలో అమ్మవారికి మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కృష్ణాపురం కాల్వ ఓం నారాయణ, మంగళి రామ్మోహన్, జిందాల్ కంపెనీ గంగా ధర్ రెడ్డి దంపతులు హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రసాద్‌గౌడును ఆలయ సేవకులు ఏఈ నాగరాజుగౌడు, ఏఈ విజయలక్ష్మి శేషవస్త్రాలను సమర్పించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

వైభవంగా గ్రామోత్సవం

చాగలమర్రి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామం లోని గంగాభవాని, చౌడేశ్వరి, గంగమ్మ ఆలయాల్లో దసరా ఉత్సవాల సందర్భంగా మంగళవారం మహిళలు సామూహికంగా చీర, సారెతో గ్రామోత్సవం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

- మండలంలోని ముత్యాలపాడు, చాగలమర్రి కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో, చాగలమ్మ ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా లక్ష కుంకుమార్చన నిర్వహిం చారు. వేద పండితులు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో మహిళలతో సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయాల అధ్యక్షులు లక్ష్మీనారా యణ, నరసింహయ్య, ధర్మకర్త లక్ష్మణబాబు, మహిళలు పాల్గొన్నారు.



ముత్యాలపాడులో మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో అమ్మవారు

వివిధ రూపాల్లో అమ్మవారు

బనగానపల్లె, డోన్, ఆళగడ్డ నియోజకవర్గాల పరిధిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తొమ్మిదోరోజు మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



రుద్రవరం, బనగానపల్లె, అవుకు, బేతంచెర్లలో మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో అమ్మవారు



డోన్, ప్యాపిలి, తిమ్మనాయునిపేట, కనకాద్రిపల్లె, శిరివెళ్లలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



డోన్ రూరల్, ఉయ్యాలవాడలో దుర్గాదేవిగా.. సంజామలలో మహాకాళికాదేవిగా..



చాగలమర్రిలో కాంతార వేషధారణలో కళాకారులు